నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శుక్రవారం 14 జూన్ 2024 | SURYAPET

బడుగులకు శుభాకాంక్షలు

మాజీ రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ తన పుట్టిన రోజు సందర్భంగా గురువారం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

ఈ ఏడాది నుంచే మెడికల్ కాలేజ్

- తాత్కాలికంగా పాత కలెక్టరేట్ భవనంలో ప్రారంభం
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- మెడికల్ కాలేజీకి అనుగుణంగా మరమ్మతులు
- తొలుత అందుబాటులో 50 ఎంబీబీఎస్ సీట్లు
- అనుబంధ ఆస్పత్రిగా భువనగిరి జిల్లా హాస్పిటల్
- కొనసాగుతున్న రిక్రూట్‌మెంట్ ప్రక్రియ
- గుట్టలో భవనం పూర్తయ్యాక అక్కడికే తరలింపు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే యాదాద్రి భువనగిరి జిల్లాకు మంజూరు

యాదాద్రి మెడికల్ కాలేజీ ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి రానుంది. పర్మినెంట్ బిల్డింగ్‌కు ఆలస్యం కావడంతో తాత్కాలిక భవనంలో భువనగిరిలో ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత 50 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాల అందుబాటులోకి రానున్నది. కాలేజీకి అనుబంధంగా భువనగిరి జిల్లా ఆస్పత్రి ఉండనుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాలేజీ మంజూరు కాగా.. పేద విద్యార్థులకు ఎంతగానో దోహదపడనున్నది.

– యాదాద్రి భువనగిరి, జూన్ 13 (నమస్తే తెలంగాణ)

మెడికల్ కళాశాల కోసం తాత్కాలికంగా ఏర్పాట్లు చేస్తున్న భువనగిరి మున్సిపాలిటీ పరిధి పగిడిపల్లిలోని పాత కలెక్టరేట్ భవనం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత నాటి బీఆర్ఎస్ సర్కారు రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసింది. అందులో భాగంగా జిల్లాలోని యాదగిరిగుట్టలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు గతేడాది జూలై 6న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ జీఓ నంబర్ 85ను విడుదల చేసింది. 100 సీట్ల కెపాసిటీతో కాలేజీ ఏర్పాటు చేస్తామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాల తరగతులు ప్రారంభమవుతాయని జీఓలో పేర్కొన్నారు. ఆ తర్వాత శ్రీలక్ష్మీనరసింహస్వామి మెడికల్ కాలేజీగా నామకరణం కూడా చేశారు. కాలేజీ నిర్మాణానికి రూ. 183 కోట్లు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ప్రిన్సిపాల్‌గా మల్లిఖార్జునను నియమించారు. ఈ ప్రక్రియలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఎంతో కృషి చేశారు.

ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం..

మెడికల్ కాలేజీ ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కానుంది. మొదట 50 ఎంబీబీఎస్ సీట్లతో ప్రారంభించనున్నారు. నీట్ షెడ్యూల్ ఆధారంగా తరగతులు షురూ అవుతాయి. యాదగిరిగుట్టలో సొంత భవన నిర్మాణానికి ఆలస్యం కానుండడంతో ప్రస్తుతానికి భువనగిరిలో తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేయనున్నారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని పగిడిపల్లిలో ఉన్న పాత కలెక్టరేట్ భవనంలో కొనసాగించాలని నిర్ణయించారు. ఇందుకోసం బిల్డింగ్‌ను ఇప్పటికే అద్దెకు తీసుకున్నారు. మెడికల్ కాలేజీకి అనుగుణంగా మరమ్మతులు చేపడుతున్నారు. ఇక జూనియర్ డాక్టర్లను రిక్రూట్ చేసుకున్నారు. తాజాగా జరిగే ప్రమోషన్లు, బదిలీల్లో ఫ్యాకల్టీని నియమించనున్నారు. దీనికి అనుబంధంగా పట్టణంలోని జిల్లా ఆస్పత్రి కొనసాగనుంది. ఇటీవల జిల్లా ఆస్పత్రి డీఎంఈ పరిధిలోకి మార్చిన విషయం తెలిసిందే. ఇందులోనూ పలు వార్డులు పునరుద్ధరిస్తున్నారు.

ఎన్నో విధాలుగా మేలు..

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కాలేజీని కొడంగల్‌కు తరలించుకుపోతారనే ప్రచారం జరిగింది. కానీ స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో తరలింపునకు ఫుల్ స్టాప్ పడింది. మెడికల్ కాలేజీ ఏర్పాటుతో జిల్లా వాసులకు ఎన్నో విధాలుగా మేలు జరుగనుంది. కళాశాల ఉంటే దానికి అనుబంధంగా ఆస్పత్రి ఉంటుంది. దీని ద్వారా వందల మందికి నిత్యం సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించవచ్చు. సూపర్ స్పెషాలిటీ సేవలు కలుపుకొని, మొత్తం 35 రకాల వైద్య విభాగాల సేవలు అందే అవకాశం ఉంటుంది. అత్యాధునిక వైద్య పరికరాలు, ల్యాబ్‌లు ఉంటాయి. డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులోకి వస్తారు. మెడికల్ కాలేజీతో అనుబంధంగా అనేక వసతులు ఏర్పడనున్నాయి. కళాశాల ఏర్పాటుతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగనున్నాయి. ప్రత్యక్షంగానే కాకుండా పరోక్షంగా కూడా వందల మందికి ఉపాధి దక్కనుంది.

శాశ్వత మెడికల్ కాలేజీ గుట్టలోనే..

యాదగిరిగుట్టలోనే శాశ్వత మెడికల్ కాలేజీ నిర్మాణం కానుంది. మొదట ఓ చోట నిర్మించాలని భావించినా స్థలానికి సంబంధించి ఇబ్బందులు తలెత్తడంతో మార్పులు జరిగాయి. భవన నిర్మాణం, క్యాంపస్ కోసం 20 ఎకరాల భూమి అవసరం పడుతుంది. గుట్టలోని సబ్ స్టేషన్ పక్కన ఉన్న స్థలాన్ని ఫైనల్ చేశారు. త్వరలోనే ఇక్కడ పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. గుట్టలో కాలేజీ నిర్మాణానికి సుమారు ఏడాది పట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. అప్పటి వరకు పాత కలెక్టరేట్ ఆఫీసులోనే మెడికల్ కాలేజీ కొనసాగనుంది.

ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ దాసరి హరిచందన

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దాసరి హరిచందన

నీలగిరి, జూన్ 13 : పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ దాసరి హరిచందన రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి గురువారం జిల్లాలోని ఆర్డీఓలు, తాసీల్దార్లతో ధరణి, సీఎం ప్రజావాణి తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు. ధరణిలో టీఎం 33లోకి దరఖాస్తులు రాగానే తక్షణమే నోటీసు జారీ చేయాలని చెప్పారు. ధరణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసిన తర్వాతే పరిష్కరించాలని సూచించారు. తాసీల్దార్లు లాగిన్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించడంలో ఆర్డీఓలు పర్యవేక్షించాలని, తాసీల్దార్లతో ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. కోర్టు కేసులకు తక్షణం స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా క్షేత్రస్థాయిలో సర్వే సమస్యలు ఉన్నట్లయితే వాటిని జాబితా రూపొందించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాని చెప్పారు. సీఎం ప్రజావాణి దరఖాస్తుల పెండెన్సీపై ఆమె సమీక్షిస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన 15 రోజుల్లోగా పరిష్కరించాలన్నారు.

ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. వివిధ దిన పత్రికల్లో వచ్చే వ్యతిరేక వార్తలపై రెవెన్యూ అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీఓలు, తాసీల్దార్లు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో హెడ్ మాస్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నాగేశ్వర్‌రావు

జీహెచ్ఎం పదోన్నతులు పూర్తి

- మల్టీ జోన్-2లో 700 మందికి అవకాశం
- నల్లగొండ జిల్లాలో 114 మంది స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి

రామగిరి, జూన్ 13 : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా స్కూల్ అసిస్టెంట్ నుంచి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ గురువారం ముగిసింది. మల్టీ జోన్-2లో 700 మంది స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం వచ్చింది. నల్లగొండ జిల్లాలో వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సీనియర్ స్కూల్ అసిస్టెంట్ 114 మందికి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి లభించింది. వీరంతా గురువారం ఉత్తర్వులు అందుకొని ఆయా పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్త జీహెచ్ఎంలకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

నిడమనూరు చెరువులో మట్టిపోసి చదును చేసిన దృశ్యం

చెరువు శిఖంలో ఆగని ఆక్రమణలు

- అడ్డగోలుగా నిడమనూరు నల్లచౌట చెరువు శిఖం కబ్జా
- ఆనవాళ్లు కోల్పోతున్న చెరువు
- ఇప్పటికే చెరువు చుట్టూ 100 ఎకరాలకు పైగా కబ్జా

నిడమనూరు, జూన్ 13 : మండల కేంద్రంలోని నల్లచౌట చెరువు శిఖం ఆక్రమణలు ఆగడం లేదు. చెరువు శిఖం వెంట వ్యవసాయ భూములు కలిగిన రైతులు ఏటా కొంత భూమిని ఆక్రమిస్తుండడంతో ఇప్పటికే చెరువు రూపురేఖలు మారిపోయాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు, ఎడమ కాల్వకు నీటి విడుదల లేకపోవడంతో చెరువులో నీరు ఖాళీ అయ్యింది. ఈ కారణంగా శిఖం భూముల్లో దర్జాగా చెరువు మట్టిని తవ్విస్తున్నారు. చెరువు చుట్టూ స్థానికులు ఫిర్యాదు చేసినా సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కనీస చర్యలు చేపట్టి ఆక్రమణలను అడ్డుకునేందుకు అందుబాటులోకి రావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చారిత్రక చెరువు ఆనవాళ్లు మాయం

నిజాం నవాబుల హయాంలో సర్వే నంబర్ 372లో 307.13 ఎకరాల్లో నిర్మించిన నల్లచౌట చెరువు పలు గ్రామాలకు వరప్రదాయినిగా ఉంది. చెరువుపై ఆధారపడి మత్స్యకార్మికులు చేపల వేటతో ఉపాధి పొందుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువును పునరుద్ధరించారు. ఆ తర్వాత చెరువు శిఖంలో ఏటా ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి.

దాంతో చారిత్రక చెరువు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. ఇప్పటికే చెరువుకు నాలుగు వైపులా సుమారు 100 ఎకరాల పైనే కబ్జాకు గురైనట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. గతంలో ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న అధికారులు శిఖం పరిరక్షణకు బాధ్యతాయుతమైన చర్యలు చేపట్టలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆక్రమణల నివారణకు సమగ్ర విచారణ జరిపి శిఖం పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ సబ్ డివిజన్ డీఈ శ్రీనివాస్ వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను రెండ్రోజుల్లో పూర్తి చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నీలగిరి, జూన్ 13 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనులు చేపట్టిందని, ఆ పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర అధికారులను ఆదేశించారు. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై నల్లగొండ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో గురువారం ఆయా శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం అమలుపై అలసత్వం వహించరాదని, పనుల్లో జాప్యం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్, పబ్లిక్ హెల్త్ ఈఈ రాములు, మెప్మా పీడీ కరుణాకర్, డీఈ ఆశోక్, ఏఈలు దిలీప్ భార్గవ్ మండల విద్యాశాఖ అధికారిని అరుంధతి, ఆయా శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నల్లగొండ మున్సిపాలిటీలో అమ్మ ఆదర్శ పాఠశాలలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యుత్ ఉద్యోగులు

ఉత్సాహంగా విద్యుత్ ఉద్యోగుల క్రీడలు

బొడ్రాయిబజార్, జూన్ 13 : క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని ట్రాన్స్‌కో ఎస్ఈ పాల్‌రాజ్ అన్నారు. టీజీ ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ 2024-25 సంవత్సరానికి సంబంధించిన సూర్యాపేట, నల్లగొండ విద్యుత్ ఉద్యోగులకు కబడ్డీ, చెస్ టోర్నమెంట్‌ను గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్పోర్ట్స్ కౌన్సిల్ ఆపరేషన్ సర్కిల్ టీజీఎస్‌పీడీసీఎల్ నిర్వహణలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న ఈ పోటీల్లో విద్యుత్ ఉద్యోగులు వివిధ జట్లుగా ఏర్పడి క్రీడలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ క్రీడా పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతి ప్రదానం చేయనున్నారని, దీనికి టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్ ముషరఫ్ ఫారూఖ్ హాజరవుతున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో కబడ్డీ 11, చెస్ పోటీల్లో 16 టీమ్‌లు పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈలు డానియేల్, వెంకటకృష్ణయ్య, శ్రీనివాస్, రాజశేఖర్, భీమానాయక్, స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, స్పోర్ట్స్ సెక్రటరీ శ్రీనివాస్, టౌన్ ఏఈ సురేశ్, శ్రీకాంత్, మహేశ్ పాల్గొన్నారు.

మైనారిటీ విద్యార్థులకు గ్రూప్-1, 2లో ఉచిత శిక్షణ

నీలగిరి, జూన్ 13 : గ్రూప్-1, గ్రూప్-2 పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 45 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారని, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మైనారిటీ అభ్యర్థులు ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి, టి.విజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను నల్లగొండ కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో జూన్ 18 సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9494345471, 7981196060 నంబర్లలో లేదా కార్యాలయ పనివేళ్లలో సంప్రదించాలని తెలిపారు.

17న 'మమతల పందిరి' కవితా సంపుటి ఆవిష్కరణ

మోత్కూరు, జూన్ 13 : ఈ నెల 17న 'మమతల పందిరి' కవితా సంపుటిని ఆవిష్కరించనున్నట్లు మోత్కూరు ప్రజా భారతి సాహిత్య సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డి.అరవిందరాయుడు, గుమిడెల్లి వెంకన్న తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కవితా సంపుటి కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థ పూర్వ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ కవి మర్రి జయశ్రీ సాహిత్య పుస్తకం రూపొందించినట్లు తెలిపారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిదారెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, ప్రముఖ గేయ రచయిత అభినయ శ్రీనివాస్ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు తెలిపారు. మోత్కూరు పట్టణంలోని వైజే ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా కవులు, సాహితీవేత్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు ఎస్ఎన్ చారి, పూర్వ ప్రధాన కార్యదర్శి జయశ్రీ, టి.ఉప్పలయ్య, వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, మనోహర్, యాకస్వామి పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్ సీజ్

చింతలపాలెం, జూన్ 13 : మండలంలోని చింత్రియాల గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను గురువారం సీజ్ చేసినట్లు తాసీల్దార్ సురేందర్‌రెడ్డి తెలిపారు. చింత్రియాలలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 75 ట్రక్కుల ఇసుక డంప్‌ను సీజ్ చేసి చింత్రియాల పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు అప్పగించినట్లు చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చింత్రియాలలో ఇసుక డంప్

జీలుగ విత్తనాల్లేవ్..

- అందుబాటులో లేని పచ్చిరొట్ట విత్తనాలు
- వానకాలం ప్రారంభమైనా దొరుకని పరిస్థితి
- నేరేడుచర్లలో 100 క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపితే వచ్చింది 30 క్వింటాళ్లే..



నేరేడుచర్ల, జూన్ 13 : వానకాలం సీజన్ నేపథ్యంలో ఇప్పటికే రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కులు దున్ని విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. కానీ ప్రతిపాదనల మేరకు విత్తనాలు మాత్రం అందుబాటులోకి రాలేదు. అసలే వర్షాలు సమృద్ధిగా పడక అవస్థలు పడుతుంటే దీనికి తోడు విత్తనాలు లేక ఇబ్బందులు పడే పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు.

వ్యవసాయ సాగుకు ఏ మేరకు విత్తనాలు అవసరమో వివరిస్తూ నెల రోజుల కిందటే వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులతో పాటు వ్యవసాయ సహకార సంఘం తరపున ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. వానకాలంలో భూసారం పెంపొందించుకోడానికి పచ్చి రొట్టగా జీలుగ సాగు చేస్తుంటారు. నేరేడుచర్ల మండలానికి జీలుగ విత్తనాలు 100 క్వింటాళ్లు కావాలని ప్రతిపాదనలు పంపగా కేవలం 30 క్వింటాలు మాత్రమే వచ్చాయి. వచ్చిన విత్తనాలను వ్యవసాయ శాఖ పంపిణీ చేయగా రెండు రోజుల్లోనే అయిపోయాయి. ఇప్పుడు మండలంలో దొరుకని పరిస్థితి ఏర్పడింది.

మండలంలో మొత్తం 24వేల ఎకరాల సాగర్ ఆయకట్టు ఉండగా వర్షాలు సమృద్ధిగా కురవకపోయినప్పటికీ బోర్లు, చెరువులు, బావులు కింద 10వేల ఎకరాలు సాగు అయ్యే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మండలంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి ఉన్నది. అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంతో, ప్రజాప్రతినిధులకు ముందుచూపు లేకపోవడమే దీనికి కారణంగా తెలుస్తున్నది.

సాగుకు సిద్ధంగా ఉన్నా..

ఈ వానకాలం సీజన్‌లో వర్షాలు బాగా కురుస్తాయని ఇప్పటికే వాతావరణశాఖ నుంచి సంకేతాలు వస్తున్నాయి. ఈ తరుణంలో రైతులు సాగుకు సానుకూలంగా ఉన్నారు. ఇప్పటికే సాగర్ ఆయకట్టు రైతులు సాగుకు సన్నద్ధం అవుతూ ఇటీవల కురిసిన వర్షాలతో దుక్కి దున్ని సిద్ధం చేశారు. ప్రధానంగా వర్షాలు బాగా కురిసి చెరువులు, కుంటలు నిండితే వరి సాగు చేయాలని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం పరిస్థితులకు అనుగుణంగా విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.

సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచుతాం

వానకాలం సీజన్ ప్రారంభ సమయం అసన్నమైనందున రైతులందరికీ సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచుతాం. మొదట ప్రతిపాదనలు పంపిన వాటిలో కొద్ది మేర విత్తనాలు తక్కువగా వచ్చాయి. వాటి కోసం మరోసారి ప్రతిపాదనలు పంపించి విత్తనాలు తెప్పిస్తాం. రైతులకు అందుబాటులో విత్తనాలు ఉంచే విధంగా కృషి చేస్తా.

–జావిద్, వ్యవసాయాధికారి, నేరేడుచర్ల